

గొంతు తడపని 'భగీరథ'
చింతలమానెపల్లి మండలంలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో నల్లాలు బిగించినా భగీరథ నీరు సరఫరా కావడం లేదు. 9లో▸



ముగిసిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు
గోలేటి టౌన్‌షిప్‌లో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ముగిశాయి. వివిధ జిల్లాలకు చెందిన సుమారు 124 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
41.7 /31.6

వాతావరణం
చాలావరకు ఎండగా ఉంటుంది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత పెరుగుతుంది. వడ గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సీఎం పర్యటనకు ఏర్పాట్లు చేయాలి



పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ఆసిఫాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పర్యటనకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలో పారిశుధ్యం, పచ్చదనం పనులను పంచాయతీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ హరిత హారం, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలకు కేటాయించిన లక్ష్యాలు పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట రోడ్ల మరమ్మతులు, ప్రభుత్వ భవనాలకు రంగులు, రహదారులపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇన్‌చార్జి డీపీవో సురేందర్, పంచాయతీరాజ్ ఈఈ రామ్మోహన్ రావు, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ ఉన్నారు.

భీం అడుగు జాడల్లో నడవాలి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ప్రజాప్రతినిధులు, తదితరులు

బెజ్జూర్(సిర్పూర్): పోరాటయోధుడు కుమురంభీం అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. బెజ్జూర్ మండలం బారేగూడలో జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, భీం మనుమడు సోనేరావ్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయిలతో కలిసి ఆదివారం కుమురంభీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ భీం చేసిన పోరాట ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ జీవితాలన్నారు. త్వరలోనే సీఎం కేసీఆర్ ఆదివాసీలకు పోడు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు, జెడ్పీటీసీలు పుష్పలత, శ్రీదేవి, మాజీ జెడ్పీ చైర్మన్ గణపతి, ఐటీడీఏ డైరెక్టర్ మాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరిస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్(సిర్పూర్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆల్ ఇండియా కాన్ఫడరేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుల్భాగిరి మహేశ్వర్‌రాజ్ అన్నారు. పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. మహేశ్వర్‌రాజ్ మాట్లాడుతూ బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. బౌద్ధ గురువులు పంచశీల జెండా ఆవిష్కరించారు. రాథోడ్ ప్రకాశ్, ఆనంద్, లక్ష్మీనారాయణ, మోహన్‌రావు, అర్షద్ హుస్సేన్, సర్పంచ్ సుధాకర్, బాబాజీ, చంద్రశేఖర్, రాజు, కిషన్ పాల్గొన్నారు.

మోగనున్న బడిగంట

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాలు
- జిల్లాలోని 37 ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ విద్య
- బడిబాటలో కొత్తగా 2,331 మందికి ప్రవేశాలు
- మండుతున్న ఎండలతో తల్లిదండ్రుల ఆందోళన



కెరమెరి మండలం ధనోరాలోని ప్రభుత్వ పాఠశాల

ఆసిఫాబాద్‌రూరల్/కెరమెరి: వేసవి సెలవులనంతరం సుదీర్ఘ విరామం తర్వాత బడి గంట మోగనుంది. సోమవారం నుంచి 2023– 24 విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. సరికొత్తగా కార్పొరేట్ దీటుగా డిజిటల్ విద్య, మన ఊరు– మన బడి కార్యక్రమంలో సౌకర్యాల కల్పన, మధ్యాహ్నం భోజనం మెనూలో మార్పులు, ఉచితంగా నోట్‌పుస్తకాలు, నూతన డిజైన్లతో యూనిఫాంలు వంటివి ఈ ఏడాది నుంచే అమలు కానున్నాయి. అయితే జిల్లా వ్యాప్తంగా రికార్డు స్థాయిలో నమోదవుతున్న పగటి ఉష్ణోగ్రతలతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రుతపవనాల రాక ఆలస్యం కావడంతో జూన్‌లోనూ దహెగాం, కాగజ్‌నగర్, చింతలమానెపల్లి మండలాల్లో 45 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

విజయవంతంగా 'బడిబాట'

జిల్లాలో మొత్తం 1,269 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 326, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 684, కేజీబీవీలు 15, ప్రైవేట్ పాఠశాలలు 119, మోడల్ స్కూళ్లు 2, జవహర్ నవోదయ 1, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలు ఉన్నాయి. సుమారు 93 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ నెల 3 నుంచి ప్రారంభమైన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, వసతులపై క్షేత్రస్థాయిలో తిరుగుతూ అవగాహన కల్పించారు. ఆదివారం వరకు జిల్లా వ్యాప్తంగా 2,331 మంది విద్యార్థులకు కొత్తగా సర్కారు బడుల్లో ప్రవేశాలు కల్పించినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఇందులో ప్రైవేట్ స్కూళ్ల నుంచి 521 మంది ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్ తీసుకోవడం విశేషం.

అందుబాటులోకి డిజిటల్ విద్య..

విద్యార్థులకు పాఠ్యాంశాలను మరింత లోతుగా, సులువుగా అర్థమయ్యే రీతిలో బోధించేందుకు ఈ ఏడాది నుంచి 37 ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ విద్య అందుబాటులోకి రానుంది. తెలంగాణ స్టేట్ టెక్నోలాజికల్ సర్వీసెస్(టీఎస్‌టీఎస్) సాయంతో 8, 9, 10 తరగతి విద్యార్థులు ఐఎఫ్‌ఎస్ టీవీల ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిన బోధించనున్నారు. దీనిపై ఇప్పటికే ఒక్కో పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకు రెండురోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఒక్కో పాఠశాలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, ఓపీఎస్, మెటల్ ఫ్రేమ్, 2 కేవీఏ ఆన్‌లైన్ యూపీఎస్, ఆరు బ్యాటరీలు, ఇతర పరికరాలు అందించారు.

సమస్యలూ ఉన్నాయి..

జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానుండగా, చాలాచోట్ల విద్యార్థులకు సమస్యలే స్వాగతం పలకనున్నాయి. ముఖ్యంగా ఉపాధ్యాయుల కొరత ఆందోళన కలిగిస్తోంది. అన్ని కేటగిరీల్లో కలిపి మొత్తం 2,444 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా, 545 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటివరకు బదిలీలపై స్పష్టత లేకపోవడంతో సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. అలాగే జిల్లాకు 3.20లక్షల పాఠ్యపుస్తకాలు అవసరం ఉండగా 90 శాతం వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే వీటిని ఇప్పటివరకు పాఠశాలలకు పంపిణీ చేయలేదు. గతేడాది చాలా చోట్ల ప్రహరీలు, తాగునీరు, అదనపు గదుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2022– 23 విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో జిల్లా ఆశించిన స్థాయిలో ఉత్తీర్ణత సాధించలేదు. ఈ నేపథ్యంలో విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే అధికారులు పక్కా ప్రణాళికతో వ్యవహరించాల్సి ఉంది.

'మన ఊరు– మన బడి'కి 251 స్కూళ్ల ఎంపిక

మన ఊరు– మన బడి కార్యక్రమానికి జిల్లాలో మొదటి విడతలో 251 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇందులో ఇప్పటికే 30 స్కూళ్లు ప్రారంభించగా, 60 చోట్ల వందశాతం పనులు పూర్తయ్యాయి. వీటిని ఈ నెలాఖరు వరకు ప్రారంభించేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. మిగిలిన పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి.

ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నాం. విద్యాపరంగా జిల్లాను రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉంచేందుకు కృషి చేస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి. ఈ నెలాఖరులోగా మన ఊరు– మనబడి మొదటి విడత పనులు పూర్తి చేస్తాం.

– అశోక్, డీఈవో



విద్యార్థి వివరాలు నమోదు చేసుకుంటున్న డీఈవో అశోక్

మరింత బలవర్ధకం



జిల్లా కేంద్రంలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థినులు (ఫైల్)

- మధ్యాహ్న భోజనం మెనూలో మార్పులు
- వారంలో ఒకరోజు కిచిడీ, వెజ్ బిర్యానీ అందించేందుకు నిర్ణయం
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు
- ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ

ఆసిఫాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో మరింత పోషక విలువలు పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మధ్యాహ్న భోజన మెనూలో మార్పులు చేయనున్నారు. ప్రస్తుతం ఇస్తున్న ఆహారంతోపాటు వారంలో ఒకరోజు కిచిడీ, వెజ్ బిర్యానీ తప్పనిసరి చేశారు. ప్రతిరోజూ మిక్స్‌డ్ విజిటేబుల్స్‌తో కర్రీ అందించనున్నారు. సోమవారం నుంచి అన్ని పాఠశాలల్లో ఈ కొత్త మెనూ అమల్లోకి రానుంది. గతంలో మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు దొడ్డుబియ్యంతో భోజనం అందించగా, రెండేళ్లుగా సన్నబియ్యంతో భోజనం పెడుతున్నారు. కొత్త మెనూ పాటించాలని తాజాగా పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి శ్రీదేవసేన అన్ని జిల్లాల డీఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో అన్నం వండిపెడుతున్నందుకు ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.5.45, హైస్కూల్ విద్యార్థులకు రోజుకు రూ.8.17 చొప్పున కూరగాయలు ఇతరత్రా ఖర్చుల కింద చెల్లిస్తున్నారు.

జిల్లాలో 54,314 మంది విద్యార్థులు

జిల్లాలో మధ్యాహ్న భోజన పథకంలో 1,067 పాఠశాలల్లో 54,314 మంది విద్యార్థులకు ప్రతిరోజూ సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నారు. మధ్యాహ్న భోజనంలో కొత్త మెనూ అమలుతో పేద విద్యార్థులకు మరింత పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందనుంది. ఇది వారి శారీరక, మానసిక ఆరోగ్య ఎదుగుదలకు ఎంతో దోహదపడుతోందని అధికారులు చెబుతున్నారు.

బడ్జెట్ పెంచితేనే ఉపయోగం

జాతీయ పోషకాహార సంస్థ కొత్త మెనూ ప్రకారం కూరగాయలు, ఇతర వస్తువుల కొనుగోలుకు ఇచ్చే మొత్తం, వంట ఏజెన్సీలకు చెల్లించే గౌరవ వేతనంలో మార్పు లేకపోవడంపై కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచకుండా, మెనూలో మార్పు చేయడంతో తమపై అదనపు ఆర్థిక భారం పడుతుందని ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలు కచ్చితంగా పాటించాలంటున్న విద్యాశాఖ అధికారులు.. అదనపు భారంపై తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. నెలనెలా మెస్ చార్జీలు, కోడి గుడ్లు, కూరగాయలు, జీత భత్యాలు తమ ఖాతాలో జమ చేసేవారని, నేటి నుంచి 2023– 24 విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో తమకు పెండింగ్ బిల్లుల చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని డిమాండ్ చేశారు. కొత్త మెనూ అమలుపై తమకు చెల్లించే బిల్లుల విషయంలో స్పష్టత నివ్వాలని కోరుతున్నారు.

ప్రస్తుత మెనూ

ఇప్పటివరకు అమల్లో ఉన్న మెనూ ప్రకారం సోమవారం కిచిడి, మిక్స్‌డ్ విజిటేబుల్ కూర, కోడిగుడ్లు అందించాల్సి ఉండగా, మంగళవారం అన్నం, సాంబారు, కిచిడి, కూరగాయలతో కూర, బుధవారం అన్నం, ఆకుకూర పప్పు, మిక్స్‌డ్ విజిటెబుల్ కూర, కోడిగుడ్డు, గురువారం విజిటెబుల్ బిర్యాణి, మిక్స్‌డ్ విజిటెబుల్ కూర, శుక్రవారం అన్నం, సాంబారు, మిక్స్‌డ్ విజిటెబుల్ కూర, కోడిగుడ్డు అందించాలి.

నేటి నుంచి అమలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో కొత్త మెనూ అమలు చేస్తాం. ఇప్పటికే దీనిపై నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశాం. నేటి నుంచి అన్ని బడుల్లో కొత్త మెనూ ప్రకారం భోజనం అందిస్తాం.

– అశోక్, డీఈవో

నకిలీ నోట్ల కేసుపై ఆరా!

- దృష్టి సారించిన నిఘా విభాగం
- జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ఉన్నతాధికారి
- 'రావుగారి అడ్డా..!' కథనంపైనా విచారణకు ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లాలో నకిలీ నోట్ల కేసు వ్యవహారంపై రాష్ట్ర నిఘా విభాగం దృష్టి సారించింది. శుక్ర, శనివారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన వరుస కథనాలపై స్పందించిన నిఘా విభాగం ఉన్నతాధికారి విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. లక్షలాది రూపాయల నకిలీ కరెన్సీతో వాంకిడికి చెందిన హిమ్రే తిరుపతి పట్టుపడితే కేవలం స్టేషన్ బెయిల్ సెక్షన్స్‌తో పోలీసులు సరిపెట్టడం, దానిపై జిల్లా ఉన్నతాధికారి ఎందుకు దృష్టి సారించలేకపోవడంపైనా ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆయన ఆదేశాల మేరకు జిల్లా నిఘా విభాగం అధికారి రంగంలోకి దిగి కేసు పూర్వాపరాలు పరిశీలించినట్లు సమాచారం. అలాగే నిందితుడికి, పోలీసులకు మధ్యవర్తిత్వం వహించిన స్థానిక ప్రజాప్రతినిధి కుమారుడు ఎవరు? అతని ద్వారా పోలీసులు ఎంత వరకు లబ్ధి పొందారు? నిందితుడికి అంత భారీ మొత్తం ఎక్కడి నుంచి వచ్చింది? అసలు నకిలీ నోట్ల కేసులో మహారాష్ట్రకు చెందిన ముఠా సభ్యులను పట్టుకోవడానికి స్థానిక పోలీసులు చేసిన ప్రయత్నాలేంటి? ప్రయత్నిస్తే దర్యాప్తు ఎంత వరకు వచ్చింది? అనే కోణాలపై ఆరా తీసి.. సమగ్ర నివేదికను నిఘా విభాగం రాష్ట్ర ఉన్నతాధికారికి అందజేసినట్లు సమాచారం.

'రావుగారి అడ్డా' కథనంపైనా..

ఈ నెల 1న 'రావుగారి అడ్డా..!' అనే శీర్షిక పేరిట 'సాక్షి'లో వచ్చిన కథనంపైనా విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. 13 ఏళ్లుగా ఆసిఫాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తిష్టవేసిన అధికారి ఎవరు? అతనికి ఏజెంట్లుగా ఉన్న రైటర్లు ఎవరు? ఒక్కో డాక్యుమెంట్‌కు సదరు అధికారికి అందజేస్తున్న కమీషన్(లంచం) ఎంత? ఆయన హయాంలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన రిజిస్ట్రేషన్లు ఎన్ని? తదితర అంశాలపై జిల్లా నిఘా విభాగం ఆధారాలు సేకరించి.. ఓ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించినట్లు తెలుస్తోంది. సదరు అధికారిపై చర్యలకు సంబంధిత శాఖకు సైతం సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. త్వరలో అతనిపై చర్యలు ఉండనున్నాయని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఉద్యమంలో సాహిత్యానిది కీలకపాత్ర

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- ఘనంగా తెలంగాణ సాహిత్య దినోత్సవం

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ ఉద్యమంలో సాహిత్యానిది కీలకపాత్ర అని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. తెలంగాణ సాహిత్య దినోత్సవంలో భాగంగా ఆదివారం అదనపు కలెక్టర్ రాజేశం, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కుతో కలిసి కాగజ్‌నగర్ పట్టణంలోని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సామల సదాశివ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలను చైతన్య పర్చడంలో కవులు, సాహితీవేత్తల పాత్ర కీలకమైందని కొనియాడారు. తెలంగాణ సారస్వత్ పరిషత్ అవార్డు గ్రహీత పెండ్యాల కిషన్‌శర్మ, కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందిన లక్ష్మీనరసింహను శాలువలతో సన్మానించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సామల సదాశివతో తమ కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. తన తండ్రి భీమ్‌రావుకు సదాశివ మాస్టారు తండ్రి నాగయ్య పంతులు గురువని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోనప్ప మాట్లాడుతూ సామల సదాశివ ఉర్దూ, తెలుగు సాహిత్యంలో ఎనలేని కృషి చేసి ఉమ్మడి ఆదిలాబాద్ స్థానాన్ని జాతీయ స్థాయిలో నిలబెట్టడం గర్వంగా ఉందన్నారు. ఎమ్మెల్యే సక్కు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కాళోజీ 'నా గొడవ' ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని కలిగిస్తే, సదాశివ మాస్టారు 'యాది' ద్వారా తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని చాటాడని కొనియాడారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, తహసీల్దార్ మునవ్వర్ షరీఫ్, రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘం అధ్యక్షుడు జయదేవ్, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లోని సదాశివ మాస్టారు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు



జిల్లా కేంద్రంలో కవులకు సన్మానం

జిల్లా కేంద్రంలో..

జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతు వేదికలో ఆదివారం తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి పాల్గొన్నారు. కవులు రచించిన దశాబ్ది ఉత్సవాల కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. 34 మంది కవితలను చదివి వినిపించారు. అనంతరం కవులను శాలువలతో సన్మానించి నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ కనక యాదవరావు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ధీమా ఇవ్వని రైతుబీమా

- రైతు మరణించి ఆరు నెలలైనా అందని పరిహారం
- ఆన్‌లైన్‌లో పేరు లేదని తిరస్కరణ
- బీమా డబ్బులు ఇప్పించాలని భార్య వేడుకోలు



కుమురం మారుతి పాస్‌పుస్తకం

చింతలమానెపల్లి(సిర్పూర్): రైతుల అకాల మరణంతో రోడ్డు పడుతున్న బాధిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుబీమాను అందుబాటులోకి తెచ్చింది. అయితే చిన్నచిన్న కారణాలతో బీమా నగదు అందక అనేక కుటుంబాలు ప్రభుత్వ కార్యాలయాలు ప్రదక్షిణలు చేస్తున్నాయి. చింతలమానెపల్లి మండలం డబ్బాకు చెందిన రైతు కుమురం మారుతికి గ్రామ శివారులో సర్వే నం.174/1/21/4లో ఎకరం 10గుంటల భూమి ఉంది. దీనికి తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ పాస్‌పుస్తకం కూడా మంజూరు చేసింది. 2022 నవంబర్ 15న మారుతి అనారోగ్యంతో చనిపోయాడు. అతడి భార్య పద్మ, కుమారుడు హరీశ్ స్థానిక పంచాయతీ కార్యాలయంలో 2022 డిసెంబర్ 12న మరణ ధృవీకరణ పత్రం సైతం తీసుకున్నారు. ఈ మేరకు జీపీ రికార్డులో కూడా నమోదైంది. నిబంధనల ప్రకారం వ్యవసాయ శాఖకు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకుని, వివరాలను స్థానిక వ్యవసాయ అధికారికి అందించారు. కానీ రైతుకు సంబంధించిన భూమి వివరాలు ఆన్‌లైన్‌లో లేవనే కారణంతో రైతుబీమాను వ్యవసాయ అధికారులు తిరస్కరించారు. సాధారణంగా మరణించిన రైతు వివరాలు సమర్పించిన 12రోజుల్లో బీమా నగదు అందించాల్సి ఉంటుంది. సంబంధిత కుటుంబసభ్యులకు అధికారికంగా మంజూరైన చెక్కును అధికారులు అందజేస్తారు. భూమి పట్టా పాసుపుస్తకం ఉన్నా రైతుకు బీమా రాకపోవడంతో కుటుంబసభ్యుల్లో ఆందోళన నెలకొంది. బీమా నగదు ఇప్పించాలని భార్య పద్మ ఐటీడీఏ కార్యాలయంలో సైతం దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయంపై ఏఈవో రాజేశ్వర్ మాట్లాడుతూ 'భూమి వివరాలు రెవెన్యూ రికార్డులలో లేకపోవడంతో సమస్య తలెత్తింది. సంబంధిత రైతుకు 2020 నుంచి రైతుబంధు కూడా రావడం లేదు. రైతుబీమాకు దరఖాస్తు చేసుకున్నా భూమి రికార్డులో లేని కారణంగా మంజూరు కాలేదు. రికార్డుల్లో వివరాలు లేనందున బీమా వర్తించే అవకాశాలు లేవు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశాం' అని తెలిపారు.

ప్రశాంతంగా గ్రూప్‌- 1 పరీక్ష



పరీక్ష కేంద్రంలో ఎస్పీ సురేశ్‌కుమార్



కాగజ్‌నగర్‌లో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆసిఫాబాద్‌రూరల్/కాగజ్‌నగర్‌టౌన్: ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లోని 10 కేంద్రాల్లో ఆదివారం గ్రూప్‌- 1 పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ రాజేశం తెలిపారు. మొత్తం 2,377 మంది అభ్యర్థులకు 1,682 మంది హాజరు కాగా 695 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకులం, సాంఘిక సంక్షేమ గురుకులంలో ఏర్పాటు చేసిన కేంద్రాలతోపాటు కాగజ్‌నగర్ పట్టణంలోని పలు కేంద్రాలను ఎస్పీ సురేశ్‌కుమార్ తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థులను పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే కేంద్రాల్లోకి అనుమతించారు. కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ రాజేశం పరీక్షను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

గ్లైఫోసెట్ పట్టివేత



గ్లైఫోసెట్, నిందితుడు ఇర్ఫాన్‌తో పోలీసులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఆదివారం తెల్లవారు జామున టాస్క్ ఫోర్స్ తనిఖీల్లో నిషేధిత గ్లైఫోసెట్ (గడ్డిమందు) స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ సీఐ సుధాకర్ తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు వాంకిడి మండలం ఇందిరానగర్‌కు చెందిన షేక్ ఇర్ఫాన్ మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న రూ.14,800 విలువైన 10 గ్లైఫోసెట్ (గడ్డిమందు) బాటిళ్లను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడు ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

తెగిపడ్డ విద్యుత్ తీగలు



రోడ్డుపై తెగిపడ్డ విద్యుత్ తీగలు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని శివగూడ, బాబేఝరి, పాట్నాపూర్, గోండ్‌గూడ తదితర గ్రామాల్లో ఆదివారం ఈదురుగాలులతో కూడిన వర్షానికి జోడేఘాట్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుపై విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు అటువైపు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

గుండెపోటుతో పీఏసీఎస్ చైర్మన్ మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

వేమనపల్లి(బెల్లంపల్లి): వేమనపల్లి మండల వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు గూడ కిషన్‌రావు (83) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఐదు రోజుల క్రితం గుండెలో నొప్పి రావడంతో స్టంట్ వేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న కిషన్‌రావు తెల్లవారు జామున నిద్రలోనే గుండెపోటు రావడంతో మృతి చెందాడు. ఎంపీపీగా మూడేళ్లు, సర్పంచ్‌గా 25 సంవత్సరాలపాటు సేవలందించాడు. పీఏసీఎస్ చైర్మన్‌గా 18 ఏళ్లుగా పని చేస్తున్నాడు. మండలంలో సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన ఆయన గతేడాది బీఆర్ఎస్‌లో చేరాడు. అతనికి భార్య మనోహరబాయి, ఇద్దరు కూతుర్లు, కుమారుడు శ్రీనివాస్ ఉన్నారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబాన్ని జెడ్పీటీసీ స్వర్ణలత, ఎంపీటీసీ సంతోష్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ బీఎడ్ కళాశాల సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. కళాశాలలో విధులు నిర్వహిస్తున్న వైద్య వెంకటేశ్ జిల్లా కేంద్రం నుంచి కళాశాలకు ఆటోలో వెళ్లాడు. ఆటో దిగుతుండగా ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. తలకు గాయాలుకావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం యథావిధిగా కళాశాలకు వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన సిబ్బంది వెంటనే మంచిర్యాలకు తరలించారు.

గాలివాన బీభత్సం



జీఎం కార్యాలయం ఎదుట రోడ్డుపై విరిగిపడిన విద్యుత్ స్తంభం

- పలుచోట్ల నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన భారీ వృక్షాలు
- ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు

మందమర్రిరూరల్/కాసిపేట: జిల్లాలో ఆదివారం కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. మందమర్రి జీఎం కార్యాలయం రోడ్డులో విద్యుత్ స్తంభాలు, చెట్లకొమ్మలు విరిగి రోడ్డుపై పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శ్రీ వేంకటేశ్వర ఆలయ ఆవరణలోని మహాలక్ష్మి ట్రేడర్స్‌లో పై కప్పు ఎగిరిపోయి సుమారు 500ల సిమెంటు బస్తాలు తడిసిపోగా రూ.2లక్షల వరకు నష్టం ఏర్పడింది. శ్రీనివాస్



పైకప్పు ఎగిరిపోయి తడిసిన సిమెంట్ బస్తాలు

ఎలక్ట్రికల్ షాపు పైకప్పు ఎగిరిపోయి సామగ్రి తడిసిపోయింది. దుర్గాదేవి ఆలయం ప్రాంగణంలో భారీ వృక్షం విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. కాసిపేట మండలంలోని దుబ్బగూడం, కాసిపేట, సోమ





దుబ్బగూడెంలో రోడ్డుకు అడ్డంగా పడ్డ చెట్లు

గూడం తదితర గ్రామాల్లో చెట్లకొమ్మలు విరిగి పడడంతో విద్యుత్ వైర్లు తెగిపోయాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దుబ్బగూడెంలో రోడ్డుకు అడ్డంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో కిలోమీటర్‌కుపైగా వాహనాలు నిలిచిపోయాయి.

పిడుగుపాటుకు వృద్ధుడు మృతి



గురువయ్య మృతదేహం

దండేపల్లి(మంచిర్యాల): పిడుగుపాటుకు వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని వెల్గనూరుకు చెందిన కత్తుల గురువయ్య(73) ఆదివారం పోచమ్మ ఆలయానికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగివస్తుండగా ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అదేసమయంలో అతనిపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

చిర్రకుంటలో 4 మేకలు, 7 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు, మేకలు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని చిర్రకుంటలో ఆదివారం కురిసిన వర్షానికి పిడుగుపడి 4 మేకలు, 7 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన బుర్రం కిష్టయ్య, దాసరి శ్రీనివాస్ రోజువారీగా ఉదయం గొర్రెలు, మేకలను తోలుకుని మేతకోసం పక్కనే ఉన్న గుట్టచెలిమె అటవీప్రాంతానికి వెళ్లారు. సాయంత్రం సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగు పడడంతో శ్రీనివాస్‌కు చెందిన 4 మేకలు, కిష్టయ్యకు చెందిన 7 గొర్రెలు మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని బాధితులు వాపోయారు.

'ఎత్తి' పోసేదెప్పుడో..!

- శంకుస్థాపనకు నోచుకోని 'పడ్తనపల్లి' లిఫ్ట్
- జిల్లా పర్యటనలో ఊసెత్తని సీఎం కేసీఆర్
- ప్రశ్నార్థకంగా 10 వేల ఎకరాలకు సాగునీటి సరఫరా



పథకం పూర్తయితే జలకళ సంతరించుకోనున్న కడెం కాలువ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనలో భాగంగా పడ్తనపల్లి ఎత్తిపోతల పథకం శంకుస్థాపనకు బీజం పడుతుందనుకున్న రైతుల ఆశలు అడియాశలయ్యాయి. 10 టీఎంసీల సామర్థ్యం, రూ.1,658 కోట్లతో నిర్మించనున్న చెన్నూర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసిన సీఎం పక్కనే ఉన్న కేవలం ఒక టీఎంసీ సామర్థ్యంతో రూ.80.50 కోట్ల నిధులు మంజూరైన పడ్తనపల్లి ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేయకపోవడంపై రైతులు నిరాశకు గురవుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎందుకు చొరవ చూపలేదని విమర్శిస్తున్నారు.

సాగునీటి సమస్య తీరుతుందని..

దాదాపు 15 ఏళ్ల క్రితం ఆరు గ్రామాలు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణంతో ముంపునకు గురయ్యాయి. వేలాది ఎకరాల సాగు భూములు ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో కోల్పోయారు. మిగిలిన కొద్దిపాటి ఎకరాలకు సాగునీటి సమస్య తలెత్తుతున్నా ఎలాగోలా రైతులు సాగు చేసుకుంటున్నారు. రైతుల విన్నపం మేరకు ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంలోనే పడ్తనపల్లి ఎత్తిపోతల పథకం ప్రకటన వచ్చింది.

నాటి ముల్కల్ల ఎత్తిపోతలను మరిపిస్తుందా?

1997లో నీటిపారుదల అభివృద్ధి సంస్థ నిర్మల్ విభాగం ఆధ్వర్యంలో ఏపీఎస్‌ఐడీసీ, డీఆర్‌డీఏలు రూ.24 లక్షల వ్యయంతో ముల్కల్ల ఎత్తిపోతల నిర్మాణం చేపట్టింది. 30 హెచ్‌పీ సామర్థ్యం గల మూడు పంపుసెట్లతో ముల్కల్ల శివారులోని దాదాపు 200 ఎకరాల బీడు భూములను సాగులోకి తీసుకువచ్చేలా పథకం అమలులోకి వచ్చింది. కానీ విద్యుత్ సరఫరా లోపం, విద్యుత్ బిల్లుల చెల్లింపు భారం, మోటార్లు తరచూ కాలిపోవడం వంటి కారణాలతో ఆ పథకం పూర్తిగా నిర్వీర్యమైపోవడమే కాకుండా కనుమరుగైంది. ఈ క్రమంలో పడ్తనపల్లి ఎత్తిపోతల పథకం శంకుస్థాపనకు నోచుకోలేదు సరికదా అసలు కార్యరూపం దాలుస్తుందా? అన్న అనుమానం వ్యక్తమవుతోంది.

ఎత్తిపోతల పథకం వస్తే ఇలా..

తాగు, సాగునీటి అవసరాలను తీర్చేందుకు గోదావరిపై ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణం జరిగింది. జలయజ్ఞంలో భాగంగా అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేయగా 2008 జులై 28న మంచిర్యాల-పెద్దపల్లి జిల్లాల మధ్య ఉన్న గోదావరిపై ఎల్లంపల్లి ప్రాజెక్ట్ శంకుస్థాపనకు బీజం పడింది. 62 గేట్లు, రూ.4,950 కోట్ల వ్యయంతో ఎనిమిదేళ్ల క్రితం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యింది. మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి మున్సిపాలిటీలకు, పెద్దపల్లి-మంథని ప్రాంతాలతో పాటు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్(సుజల స్రవంతి) పథకం కింద తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఎన్టీపీసీ, సింగరేణి పారిశ్రామిక అవసరాలకు కూడా నీటిని తరలిస్తున్నారు. గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. పడ్తనపల్లి ఎత్తిపోతల పథకం పనులకు శంకుస్థాపన జరిగితే హాజీపూర్ మండల రైతాంగానికి రెండు పంటలకు సరిపడా సాగునీరు అందుతుందని రైతులు ఆశపడ్డారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి విడుదలయ్యే 1టీఎంసీ నీరు 42 కడెం డిస్ట్రిబ్యూటరీ కాలువకు అనుసంధానం అయ్యేది. దీంతో ఎత్తిపోతల పథకం ద్వారా ప్రతీ ఎకరా తడిసి వ్యవసాయ భూములు సస్యశ్యామలం అయ్యేవి. మండలంలోని 10 వేల ఎకరాల వరకు భూములు సాగులోకి వచ్చేవి. కానీ సీఎం కేసీఆర్ ఆ ఊసే ఎత్తకపోవడంతో రైతులు భంగపాటుకు గురయ్యారు. అయితే ట్రిబ్యూనల్ అనుమతులు రాకపోవడంతోనే ఎత్తిపోతల పథకం శంకుస్థాపనకు నోచుకోలేదని కొంతమంది పేర్కొంటుండడం కొసమెరుపు.

13 నుంచి బదిలీలు, పదోన్నతులు

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి



మాట్లాడుతున్న ఇన్నారెడ్డి

జన్నారం(ఖానాపూర్): ప్రభుత్వం ఈ నెల 13 నుంచి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టనున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2003 డీఎస్సీ, సీపీఎస్ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలయ్యేలా పీఆర్టీయూ కృషి చేస్తోందన్నారు. జీపీఎఫ్, ఎస్ఎల్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎంఈవో విజయ్‌కుమార్, పీఆర్టీయూ అధ్యక్షుడు రాజమౌళి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జాడి మురళి, జాజాల శ్రీనివాస్, నాయకులు శివదాస్, దేవోజీ, ప్రవీణ్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు

కాగజ్‌నగర్‌టౌన్: ఒకరిపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్సై అంజయ్య తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన నరేష్ శనివారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో పనిచేసి ఇంటికి వస్తుండగా అదే కాలనీకి చెందిన సూరజ్, హరీష్, బంటి, రోహిత్ పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని బీరు సీసాలతో దాడి చేశారు. దీంతో నరేష్‌కు తీవ్రగాయాలు కావడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుని సోదరుడు వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

తేనెటీగల దాడిలో ఎనిమిది మందికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: తేనెటీగల దాడిలో ఎనిమిది మంది గాయపడిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మానిక్ గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొమ్ముగూడకు చెందిన ఓ కుటుంబం విత్తనపూజ కోసం మైసంలొద్దిలోని ఆలయానికి వెళ్లింది. సమీపంలోనే ఉన్న తేనెటీగలు వారిపై దాడి చేయడంతో అక్కడినుంచి పరుగులు తీశారు. వారిలో నలుగురు చిన్నారులు, నలుగురు పెద్దలపై దాడి చేసి గాయపరిచాయి. వెంటనే వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

టీపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నారాయణరావు

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్(టీపీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా టీపీఏ మాజీ జిల్లా అధ్యక్షుడు బి.నారాయణరావు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన టీపీఏ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ సైకాలజిస్టు నారాయణరావును నియమించినట్లు ప్రకటించారు.

వంతెన నిర్మాణానికి స్థలపరిశీలన



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

వేమనపల్లి(బెల్లంపల్లి): ప్రాణహిత నదిపై అంతర్రాష్ట వంతెన నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్థల పరిశీలన చేశారు. అనంతరం మత్తడివాగును పరిశీలించి వర్షాకాలంలోగా వంతెన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేణుమాధవ్, మాజీ సర్పంచ్ కుబిడె వెంకటేశ్, రైతుబంధు మండల అధ్యక్షుడు భీమయ్య ఉన్నారు.





ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఆదివాసీల ఆరాధ్యదైవం ఇంద్రాదేవి ఆలయంలో ఆదివారం విత్తనపూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీ రైతులు తరలివచ్చారు. నవధాన్యాలతో కూడిన నైవేద్యం తయారు చేసి ఇంద్రాదేవికి సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు.

– ఇంద్రవెల్లి(ఖానాపూర్)

కొరమీను..లాభాలు బాగు

- ఎకరం విస్తీర్ణంలో చెరువు తవ్వకం
- ఎనిమిది నెలల వ్యవధిలో మూడున్నర టన్నుల చేపలు దిగుబడి
- రూ.9 లక్షల వరకు ఆదాయం



కొరమీను చేపలు

దండేపల్లి(మంచిర్యాల): సేంద్రియ పద్ధతిలో పంటలు పండించడంతో పాటు చేపల పెంపకం చేపట్టి లాభాలు గడిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన నందుర్క సుగుణ, నారాయణ దంపతులు. తమకున్న ఐదెకరాల మాగాణిలో నాలుగెకరాల్లో దేశీ వంగడాలైన ఎర్రవరి, తెల్లవరితో పాటు మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలు పండిస్తున్నారు. ఎకరం విస్తీర్ణంలో చెరువు తవ్వించి అందులో కొరమీను చేపలు పెంచుతున్నారు.

6,500 చేప పిల్లలు విడుదల

నారాయణ దంపతులు ఎకరం విస్తీర్ణంలో ఎనిమిది నెలల క్రితం చెరువును తవ్వించి అందులో 6,500ల చేప పిల్లలను వేశారు. ప్రస్తుతం రెండున్నర టన్నుల దిగుబడి వచ్చింది. మరో టన్ను వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. టన్నుకు రూ.3 లక్షల చొప్పున రెండున్నర టన్నులు విక్రయించాడు. మొత్తంగా రూ.9 లక్షల వరకు ఆదాయం సమకూరనుందని సుగుణ, నారాయణ దంపతులు తెలిపారు. చేప పిల్లలకు రూ.లక్ష, దాణాకు రూ.4 లక్షలు ఖర్చు అయ్యాయని వారు పేర్కొన్నారు. సాగుతో పాటు, చేప పిల్లల పెంపకంలో కుమారులు మురళి, పవన్, ప్రశాంత్ సహకరిస్తారని దంపతులు తెలిపారు.

మంచి దిగుబడి వచ్చింది



మా కుమారులు పవన్, ప్రశాంత్ సలహా మేరకు వ్యవసాయానికి అనుబంధంగా చేపల చెరువును తవ్వించాం. అందులో 6,500 చేప పిల్లలు వేశాం. ఎనిమిది నెలల వ్యవధిలో మూడున్నర టన్నుల దిగుబడి వచ్చింది. వ్యవసాయంతో పాటు చేప పిల్లల పెంపకం కూడా బాగుంది.

– సుగుణ, నారాయణ దంపతులు

'కటకం' మృతి విప్లవోద్యమానికి తీరని లోటు



నివాళులర్పిస్తున్న విరసం నేతలు

- విప్లవ రచయితల సంఘం (విరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాణి

బెల్లంపల్లి: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ మృతి విప్లవోద్యమానికి తీరని లోటని విప్లవ రచయితల సంఘం (విరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాణి అన్నారు. ఆదివారం బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలి భవన్‌లో సుదర్శన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదర్శన్ గొప్ప విప్లవ మేధావి అని ప్రశంసించారు. విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఎంతో మేథోమథనం చేశారని గుర్తు చేశారు. దండకారణ్యంలో పార్టీ నిర్మాణానికి పునాది వేసిన వారిలో సుదర్శన్ అగ్రగణ్యుడన్నారు. ప్రజాచైతన్యంతోనే విప్లవోద్యమం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ నాటి పరిస్థితుల్లో విప్లవోద్యమం అవసరం ప్రజలకు ఎంతగానో ఉండేదన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్, నారాయణరావు మాట్లాడుతూ మావోయిస్టు ఉద్యమం ప్రస్తుతం దేశంలోని 16 రాష్ట్రాల్లో కొనసాగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచివేయడానికి ఆదివాసీ ప్రాంతాల్లో డ్రోన్‌లతో దాడులు చేయిస్తోందన్నారు. అమరుల ఆశయ సాధనకోసం మావోయిస్టు పార్టీ పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.సూరిబాబు, అమరులు, బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర నాయకురాలు పద్మకుమారి, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా నడిచిన పలు రైళ్లు

- బల్లార్షా-కాజీపేట మార్గంలో నిలిపివేత
- రైల్వేలైన్‌కు సంబంధించిన విద్యుత్ తీగ తెగడంతో సమస్య
- ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు

కాగజ్‌నగర్‌టౌన్: రైల్వేలైన్‌కు సంబంధించిన విద్యుత్ తీగ తెగడంతో ఏర్పడిన సమస్య కారణంగా పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. ఆదివారం మధ్యాహ్నం బెల్లంపల్లి-మందమర్రి రైల్వేస్టేషన్ల మధ్యలో రైల్వే లైన్‌కు సంబంధించిన విద్యుత్ తీగ ప్రమాదవశాత్తు తెగింది. ఎలాంటి ప్రమాదం జరగనప్పటికీ ఆయా రైళ్లను రైల్వేస్టేషన్లలో గంటల తరబడి నిలిపివేశారు. సికింద్రాబాద్-కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కాగజ్‌నగర్ నుంచి మధ్యాహ్నం 2:55 గంటలకు బయల్దేరాల్సి ఉండగా 6 గంటలకు బయల్దేరింది. సికింద్రాబాద్-దానపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు మధ్యాహ్నం 2:30 గంటలకు చేరుకోగా 5:30 గంటలకు బయల్దేరింది. చెన్నై-కాట్రా(అండమాన్), జీటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు సైతం మూడు గంటల పాటు ఆలస్యంగా నడిచాయి. పలు గూడ్స్ రైళ్లను గంటల తరబడి ఆయా స్టేషన్లలో నిలిపివేశారు. ఈ విషయమై రైల్వే అధికారులను సంప్రదించగా బెల్లంపల్లి-మందమర్రి మధ్య సాంకేతిక సమస్య కారణంగానే ఆలస్యంగా రైళ్లు నడిచినట్లు వివరించారు.



కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో నిలిచిఉన్న రైళ్లు